క్లుప్తంగా

నిరుద్యోగ యువత అర్హతలు గుర్తించండి

చాగల్లు: సచివాలయ సిబ్బంది గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి నిరుద్యోగ యువతను గుర్తించి వారి విద్యార్హతల వివరాలను యాప్‌లో పొందుపరచాలని ఎంపీడీవో ఆర్.శ్రీదేవి సూచించారు. నిరుద్యోగుల ఇంటి లొకేషన్ ఆధారంగా ఓటీపీ ద్వారా సర్వేను ప్రారంభించాలని ఆదేశించారు. ఈ విధంగా గుర్తించిన నిరుద్యోగ యువతకు ప్రభుత్వం ఉపాధి అవకాశాలు కల్పిస్తుందని ఆమె పేర్కొన్నారు. నైపుణ్య గణన సర్వేలో భాగంగా మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సచివాలయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

15 నుంచి నైపుణ్య గణన

నిడదవోలు రూరల్: నిరుద్యోగులను గుర్తించి వారికి ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 15 నుంచి ఇంటింటా నైపుణ్య గణన కార్యక్రమం చేపట్టినట్టు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కేవీ గణేశ్ తెలిపారు. మండలంలోని సమిశ్రగూడెం మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులకు నైపుణ్య గణన యాప్‌లలో నమోదుపై శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. నైపుణ్య గణన ఆధార్‌తో అనుసంధానం చేయడంతో పాటు విద్యార్హత తదితర వివరాలను నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

డిసెంబర్ 14న జాతీయ మెగా లోక్ అదాలత్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా తొమ్మిదో అదనపు జడ్జి అనురాధ

కొవ్వూరు: డిసెంబర్ 14న నిర్వహించే జాతీయ మెగా లోక్ అదాలత్‌లో రాజీమార్గం ద్వారా ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా సహకరించాలని జిల్లా తొమ్మిదో అదనపు జడ్జి ఎం.అనురాధ సూచించారు. కొవ్వూరు బార్ అసోసియేషన్‌లో మంగళవారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో న్యాయమూర్తి మాట్లాడారు. క్రిమినల్, సివిల్, చెక్ బౌన్స్, వాహన ప్రమాదాల ,బీఎస్ఎన్ఎల్‌తో సహా రాజీ పడదగిన అన్ని రకాల కేసులనూ లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి.సాయికృష్ణ, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.నాగలక్ష్మి, బార్ అసోసి యేషన్ అధ్యక్షుడు యాగంటి చలపతిరావు, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల ఉద్యోగిపై కేసు

కొవ్వూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల రికార్డు అసిస్టెంట్ పీవీవీ సత్యనారాయణపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. సత్యనారాయణ తరచూ మద్యం తాగి విధులకు హాజరవుతున్నారని, అదేమని ప్రశ్నిస్తే దుర్భాషలు ఆడుతూ తనను చంపుతానని బెదిరిస్తున్నాడంటూ ఆ కళాశాల ప్రిన్సిపాల్ జి.సతీష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంతే గాకుండా కళాశాలలో అసభ్యకరంగా మాట్లాడుతూ వాట్స్‌ప్‌లో అసభ్యకర మెసేజ్‌లు పెడుతున్నాడని ప్రిన్సిపాల్ ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై కోర్టు అనుమతి మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్సై కె.జగన్‌మోహన్‌రావు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దేవరపల్లి: స్థానిక 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో 11 కేవీ దేవరపల్లి టౌన్ ఫీడర్ నూతన ఫీడర్ పనులు జరుగుతున్నందున బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీ ఈపీడీసీఎల్ నిడదవోలు ఆపరేషన్స్ ఈఈ ఎస్. నారాయణ అప్పారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

మృతుల కుటుంబాలకు మంత్రి దుర్గేష్ పరామర్శ



మృతుల కుటుంబాలను పరామర్శిస్తున్న మంత్రి కందుల దుర్గేష్

ఉండ్రాజవరం: మండలంలోని తాడిపర్రు గ్రామంలో విద్యుత్ షాక్‌తో మృతి చెందిన నలుగురి కుటుంబాల వారికీ ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. సర్దార్ పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ ఏర్పాట్లలో భాగంగా ఈ గ్రామంలో సోమవారం భారీ ఫ్లెక్సీ కడుతూ విద్యుత్ షాక్ తగిలి మృతి చెందిన నలుగురు కుటుంబ సభ్యులను మంగళవారం మంత్రి పరామర్శించారు. అనంతరం దుర్ఘటన జరిగిన ప్రదేశాన్ని కూడా ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు కూడా పాల్గొన్నారు.

మాలధారులకు ఏటా అన్నదానం

- దేవరపల్లిలో 18 ఏళ్లుగా..
- రోజుకు 300 మంది స్వాములకు వడి, భిక్ష
- 55 రోజుల పాటు సేవా కార్యక్రమం

దేవరపల్లి: స్థానిక అయ్యప్ప స్వామి ఆలయం వద్ద మాలధారులకు అన్నదానం చేస్తున్నారు. అక్టోబరు 7న ప్రారంభమైన ఈ కార్యక్రమం ఈ నెల 25 వరకూ కొనసాగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అయ్యప్ప, భవానీ మాలధారులకు ఉచితంగా ఉదయం వడి (అల్పాహారం), మధ్యాహ్నం భోజనం (భిక్ష) ఏర్పాటు చేస్తున్నారు. దేవరపల్లి పరిసర గ్రామాల స్వాములు, భవానీలకే గాకుండా ఇతర జిల్లాల నుంచి కాలి నడకన వెళుతున్న స్వాములకు, భవానీలకు ఉచితంగా వడి, భిక్ష ఏర్పాటు చేస్తున్నారు. అన్నదానం వల్ల మాలధారణ చేసే స్వాముల సంఖ్య ఏటా పెరుగుతోంది.



దేవరపల్లి అయ్యప్ప స్వామి ఆలయం వద్ద నిర్వహిస్తున్న అన్నదానం



దేవరపల్లిలోని అయ్యప్ప స్వామి ఆలయం

గత 18 ఏళ్లుగా..

గత 18 ఏళ్లుగా ఆలయం వద్ద దాతల సహకారంతో అన్నదానం నిర్వహిస్తున్నారు. ఏటా దసరా నుంచి 55 రోజుల పాటు ఈ కార్యక్రమం జరుగుతుంది. అయ్యప్ప మాలధారులు నియమాలు పాటిస్తూ అన్న ప్రసాదం స్వీకరిస్తున్నారు. జనవరి 15న ఆలయ ప్రాంగణంలో కర్పూర జ్యోతి దర్శనం కల్పిస్తున్నారు.

6న పడిపూజ

ఆలయం వద్ద ఈ నెల 6వ తేదీ ఉదయం అయ్యప్ప స్వామి ఊరేగింపు, రాత్రి 7 గంటలకు పడిపూజ నిర్వహిస్తారు.

ఈ నెల 22న ఉదయం గణపతి హోమం, సాయంత్రం కలశపూజ నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

అన్నదాన పథకానికి ఆదరణ



అన్నదాన పథకానికి దాతల ఆదరణ బాగుంది. రోజూ 300 మందికి అన్నదానం చేస్తున్నాం. ఈ ఆలయం నిర్మించి 36 ఏళ్లు అయింది. 18 ఏళ్లుగా స్వాములకు ఉచితంగా వడి, భిక్ష ఏర్పాటు చేస్తున్నాం. కాకర్ల వీర్రాజు ట్రస్ట్ ద్వారా కాకర్ల వెంకటేశ్వరరావు, దాతల తోడ్పాటుతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. 36 ఏళ్లుగా మాల వేసుకుని 43 సార్లు శబరిమల అయ్యప్ప స్వామి దర్శనం చేసుకున్నా.

– పొన్నాడ వెంకటరమణ, గురుస్వామి, దేవరపల్లి

నిరాటంకంగా అన్నదానం



గ్రామానికి చెందిన అడ్డా సీతారామచంద్రస్వామి గురుస్వామి, దుద్దుకూరుకు చెందిన కాకర్ల వీర్రాజు స్వామి ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. తొలుత 100 మందితో అన్నదానం ప్రారంభించాం.

– తీగెల బలరామయ్య, గురుస్వామి, దేవరపల్లి

దాతల సహకారంతో..



ఆలయ నిర్మాణానికి మా తండ్రి కాకర్ల వీర్రాజు స్వామి స్థలాన్ని విరాళంగా ఇచ్చారు. దుద్దుకూరు, దేవరపల్లి గ్రామాల ప్రజలు, అయ్యప్పస్వాముల భక్తుల సహకారంతో ఆలయ నిర్మాణం జరిగింది. మా తండ్రి గ్రారు ట్రస్టీగా ఉండేవారు. ఆలయ అభివృద్ధికి నా వంతు సహకారం అందజేస్తున్నా.

– కాకర్ల వెంకటేశ్వరరావు స్వామి, ఆలయ ధర్మకర్త, దుద్దుకూరు

'మానవత' సేవలు మరింతగా విస్తరించాలి

ఉండ్రాజవరం: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సేవలను గ్రామాల్లో మరింత ముందుకు తీసుకుపోవాలని ఆ సంస్థ జిల్లా నియంత్రణ కమిటీ చైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు అన్నారు. మానవత స్వచ్ఛంద సంస్థ ప్రాంతీయ సమావేశం మండలంలోని వడ్లూరు గ్రామంలోని సీతారామా కల్యాణ మంటపంలో మంగళవారం జరిగింది. ఆ సంస్థ అధ్యక్షుడు కఠారి సిద్ధార్థరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశానికి తణుకు, తాడేపల్లిగూడెం, ఉండ్రాజవరం, నిడదవోలు, చాగల్లు మండలాల సభ్యులు హాజరయ్యారు. సంస్థ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు దేవినేని భాస్కరరావు తన ప్రసంగంలో మానవత సేవలు, సభ్యత్వాలు, ఆడిటింగ్‌పై సభ్యులకు అవగాహన కల్పించారు. అనంతరం ఉండ్రాజవరం మానవత యూనిట్ తరఫున పలువురికి ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సమన్వయ కమిటీ చైర్మన్ కండెపు సూర్యనారాయణ, జిల్లా శాంతి రథం చైర్మన్ గమిని రాంబాబు, జిల్లా డైరెక్టరీ చైర్మన్ రామిశెట్టి గంగాధర్‌రావు, జిల్లా కార్యదర్శి పి.రత్నాకరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

నల్లజర్ల: మండలంలోని దూబచర్లకు చెందిన కోనాల కల్యాణి భీమవరంలోని విష్ణు ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతోంది. ఆమెకు ఫీజుల నిమిత్తం మండల మానవత సంస్థ రూ.10 వేల ఆర్థిక సాయాన్ని మంగళవారం అందజేసింది. కార్యక్రమంలో ఆ సంస్థ మండల శాఖ అధ్యక్షురాలు ఝాన్సీరాణి, రీజియన్ చైర్మన్ గుత్తికొండ వరప్రసాద్, ఐడీవీ అప్పారావు, నందం రాజేంద్ర ప్రసాద్, బొందల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ధాన్యం సేకరించిన 48 గంటల్లో సొమ్ము

- జేడీఏ మాధవరావు
- శెట్టిపేటలో రైతులకు శిక్షణ కార్యక్రమం

నిడదవోలు రూరల్: ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లో సొమ్ములు జమ అవుతాయని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు తెలిపారు. పంట కోతల అనంతరం రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలపై మండలంలోని శెట్టిపేటలో మంగళవారం వారికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జేడీఏ మాధవరావు మాట్లాడుతూ వరి పంటలోని కేళీలను ఏరివేస్తే ధాన్యం నాణ్యత పెరుగుతుందన్నారు. ధాన్యంలో తేమశాతం 17 శాతానికి వచ్చే వరకూ ఎండబెట్టుకోవాలని సూచించారు. రైతు సేవాకేంద్రాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు తమ ధాన్యాన్ని మద్దతు ధర రూ.1725 (75 కేజీల బస్తా)కు విక్రయించుకోవాలన్నారు. ఈ సీజన్లో రైతులు తమకు నచ్చిన రైస్ మిల్లుకు ధాన్యాన్ని పంపుకోవచ్చన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి జి.సత్యనారాయణ, ఏఈఓ కృష్ణ, అగ్రికల్చరల్ అసిస్టెంట్ భానుశేఖర్, స్థానిక రైతులు గంటా విజయ్, గంటా సోమన్న, పాతంశెట్టి శ్రీనివాసరావు, కటిక రెడ్డి చినబాబు, రోళ్ల వెంకట గంగరాజు తదితరులు పాల్గొన్నారు.



శెట్టిపేటలో అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

నిడదవోలులో ఘనంగా అయ్యప్ప కలశపూజ

నిడదవోలు: అయ్యప్ప మాలధారుల శరణు ఘోషతో పట్టణంలోని శేషగిరి హాస్పిటల్ ప్రాంగణం సోమవారం రాత్రి మార్మోగింది. స్వామియే శరణం అయ్యప్పా అంటూ భక్తులు కలశపూజ చేశారు. డాక్టర్ తోపరాల కల్యాణ చక్రవర్తి స్వామి ఆధ్వర్యంలో ఇక్కడ అయ్యప్ప కలశ పూజ ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో అయ్యప్ప మాలధారులు తరలి వచ్చారు. ప్రత్యేక ఆహ్వానితుడిగా రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ హాజరయ్యారు. ఇక్కడ ఏర్పాటు చేసిన దేవతామూర్తుల సెట్టింగ్, పుష్పాలంకరణ, స్వామివారి 18 మెట్ల సెట్టింగ్ భక్తులను ఆకట్టుకున్నాయి. కలశ పూజ అనంతరం స్వాములందరికీ వడి ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, అర్చకులు బాదంపూడి రామకృష్ణ, గాయత్రీ శర్మ, గురుస్వామి గంధం అంజిబాబు, పాటీ అయ్యప్పస్వామి, జనసేన పట్టణశాఖ అధ్యక్షుడు రంగా రమేష్, కౌన్సిలర్ కారింకి నాగేశ్వరరావు, గంగుల గోపియాదవ్, బండి గోపాలకృష్ణ పాల్గొన్నారు.



అయ్యప్ప కలశ పూజ చేస్తున్న మాలధారులు, వేద పండితులు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

దేవరపల్లి: జాతీయ రహదారిపై మండలంలోని యర్నగూడెం వద్ద మంగళవారం జరిగిన ప్రమాదంలో ఇరువురు తీవ్రంగా గాయపడ్డారు. బైక్‌పై వెళుతున్న ఇరువురు వ్యక్తులను గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో వారిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌లో గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించినట్టు తెలిసింది. క్షతగాత్రుల వివరాలు తెలియవలసి ఉంది.

పంటల బీమా ప్రీమియం రైతులే చెల్లించాలి

- మండల వ్యవసాయాధికారి కమల్‌రాజ్
- గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

నల్లజర్ల: గత ప్రభుత్వ హయాంలో పంటలబీమా ప్రీమియం సొమ్మును ప్రభుత్వమే చెల్లించేదని, రైతులు కేవలం ఈ–క్రాప్ నమోదు మాత్రం చేసుకుంటే సరిపోయేదని మండల వ్యవసాయాధికారి కమల్‌రాజ్ అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఆ నిబంధనలు మార్చినందున 2024 రబీ సీజన్ నుంచి రైతులు తమ ఇష్టపూర్వకంగా పంటల బీమా ప్రీమియం సొమ్ము చెల్లించాల్సి ఉంటుందని ఆయన వివరించారు. అనంతపల్లి, కవులూరు గ్రామాల్లో మంగళవారం »పొలం పిలుస్తోంది« కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ వరి పండించే రైతులు బీమా ప్రీమియంగా రూ.630 మీసేవా కేంద్రంలో గాని, కామన్ సర్వీసు కేంద్రంలో గాని చెల్లించి ఆ వివరాలు రైతు సేవాకేంద్రంలో అందజేయాలన్నారు. కౌలు రైతులు సీసీఆర్‌సీ కార్డులు, రైతులు 1–బి, ఆధార్ జిరాక్స్‌తో రిజిస్టరు చేసుకోవాలన్నారు. మండలంలోని 14 చోట్ల ఖరీఫ్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్టు చెప్పారు. కార్యక్రమంలో కృషీ విజ్ఞానకేంద్రం శాస్త్రవేత్తలు పెదబాబు, రేఖ వివిధ విషయాలు వివరించారు. ఉద్యానశాఖాధికారి బబిత, వీఏఏ జాన్‌పాల్, సుధీర్‌బాబు, వీహెచ్ఏ భవానీ, ఏఈఓ పుష్పలత పాల్గొన్నారు.



అనంతపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, రైతులు



తాళ్లపూడి మండలం పోచవరం సమావేశంలో మాట్లాడుతున్న సుజాతకుమారి

ఉద్యాన పంటలకూ బీమా చేయించుకోవాలి

తాళ్లపూడి: ప్రధాన మంత్రి పసల్ బీమా యోజనను ప్రతి రైతూ ఉపయోగించుకోవాలని జిల్లా ఉద్యానవన శాఖాధికారి బి.సుజాతకుమారి సూచించారు. మండలంలోని అన్నదేవరపేట, పోచవరం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ పంటలను బీమా ద్వారా రైతులు ధైర్యంగా వ్యవసాయం చేయవచ్చన్నారు. రబీలో ఈ బీమా పథకంలో చేరేందుకు జీడిమామిడి రైతులకు ఈ నెల15 వరకే గడువు ఉందన్నారు. ఎకరాకు రూ.1500 చొప్పున ప్రీమియంగా చెల్లించాలని, ఈకేవైసీ, ఈ–పంట నమోదు పూర్తి చేసుకున్న వారు ఈ పథకానికి అర్హులని వివరించారు. జీడిమామిడి పండించే రైతులు జిల్లాలో 7,619 మంది ఉన్నారన్నారు. మండలాల వారీగా వారందరికీ ప్రధాన మంత్రి పసల్ బీమా యోజనపై అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో కొవ్వూరు ఉద్యానవన శాఖాధికారి శ్రీనివాస్, ఏవో జి.రుచిత, ఇస్కో టోకియో బీమా కంపెనీ ప్రతినిధి పండు, రైతులు పాల్గొన్నారు.

సెంట్రల్ జైల్ ఉద్యోగిని అదృశ్యంపై కేసు

కొవ్వూరు: రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో జూనియర్ అసిస్టెంట్ కమ్ టైపిస్టుగా పని చేస్తున్న మన్నె విజయ అదృశ్యమైంది. కొవ్వూరు వాటర్ ట్యాంకు ఏరియాలో నివాసం ఉంటున్న ఆమె అక్టోబర్ 11 నుంచి కనిపించడం లేదు. దీనిపై బాపట్ల జిల్లా నగరంలో నివాసం ఉంటున్న ఆమె సోదరి పాగోలు ఉదయ భాస్కరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం పట్టణ ఎస్సై కె.జగన్‌మోహన్‌రావు కేసు నమోదు చేశారు. విజయ అక్టోబర్ 11 నుంచి ఆఫీసుకు రావడం లేదంటూ ఆమె సోదరికి సెంట్రల్ జైల్ అధికారులు నోటీసు పంపారు. అక్టోబర్ 11న ఇంటికి తాళం వేసిన విజయ తాను నెల రోజుల వరకూ ఇంటికి రానని హౌస్ ఓనర్‌కి ఫోన్ చేసి చెప్పి వెళ్లినట్టు ఎస్సై తెలిపారు. కాగా 45 ఏళ్ల వయసున్న విజయ అవివాహిత అని, కొవ్వూరులో ఆమె ఒక్కరే ఉంటున్నారు.

ఆశ్రమంలోని వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

దేవరపల్లి: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు, గోపాలపురం మండలం కోమటికుంటకు చెందిన వెలగా శ్రీరామ్మూర్తి కుమారుడు మణి తేజ (లండన్) జన్మదిన వేడుకలను మండలంలోని కృష్ణంపాలెంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మెమోరియల్ ట్రస్ట్ వృద్ధాశ్రమంలో మంగళవారం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆశ్రమంలోని వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేసి, భోజన ఏర్పాటు చేశారు. ఆశ్రమం నిర్వహణకు రూ.20 వేల విరాళాన్ని నిర్వాహకురాలు జి.శ్యామలాదేవికి అందజేశారు. సుమారు 10 ఏళ్లుగా ఆశ్రమం నిర్వహిస్తూ అనాధ వృద్ధులకు ఆశ్రయం కల్పిస్తున్న శ్యామలాదేవిని శ్రీరామ్మూర్తి అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మహిళా విభాగం మండలశాఖ అధ్యక్షురాలు కడలి హైమావతి, ఏఎంసీ మాజీ డైరెక్టర్ సాలి వేణు, బీసీ విభాగం జిల్లా కార్యదర్శి మారిశెట్టి బాబూగౌడ్, పార్టీ శ్రేణులు పాల్గొన్నాయి.



వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నేత వెలగా శ్రీరామ్మూర్తి తదితరులు

నాగేంద్రా..మా పూజలు అందుకో..

- భక్తిశ్రద్ధలతో నాగుల చవితి
- పుట్టల్లో పాలుపోసిన భక్తులు
- సుబ్రహ్మణ్య ఆలయాల్లో రద్దీ

నిడదవోలు: నాగుల చవితి పండగను భక్తులు మంగళవారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక ఎస్వీడీ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఆవరణ, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఆవరణ, విద్యుత్ సబ్‌స్టేషన్, లయన్స్ కంటి ఆసుపత్రి వెనుక గల, సెయింట్ ఆంబ్రోస్ స్కూల్ లోపల గల పొలాల్లోని పాము పుట్టల్లో భక్తులు పాలు పోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అవివాహితులు వివాహం కావాలని, వివాహితులు సంతాన ప్రాప్తి కలగాలని కోరుతూ నాగదేవతను వేడుకున్నారు. నాగదేవతకు ఇష్టమైన చలివిడి, చిమ్మిలి, అరటి పండ్లు, తాటి బుర్రగుంజు, తేగలను నైవేద్యంగా సమర్పించారు. దీపావళి రోజున మిగిలిపోయిన బాణసంచాను పుట్టల వద్ద వెలిగించారు.

ఉండ్రాజవరం: నాగులచవితి సందర్భంగా ఉండ్రాజవరంలోని శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని విశేషంగా అలంకరించారు. నాగుల చవితిని పురస్కరించుకుని పాలంగి గ్రామంలో నిర్వహిస్తున్న వాజపేయం యాగం శ్రౌత యాగశాలలో వేద పండితులు సుబ్రహ్మణ్యస్వామిని ఆవాహన చేసి భక్తులను ఆశీర్వదించి ప్రసాద వితరణ చేశారు. ముందుగా భక్తులకు సర్పదోష నివారణ, దంపతుల అన్యోన్య దాంపత్యం, ఆరోగ్యప్రాప్తి కోసం స్మార్త యాగశాలలో సుబ్రహ్మణ్య పాశుపాల రుద్రాభిషేకం, సూర్య నమస్కారాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. సాయంత్రం సుబ్రహ్మణ్య పాశుపత రుద్ర హోమాలు, చండీ హోమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

చాగల్లు: ఉదయాన్నే భక్తులు సమీప పొలాలకు చేరుకుని పుట్టల్లో పాలు పోసి నాగేంద్రునికి పూజలు చేశారు. బ్రాహ్మణగూడెం, ఊనగట్ల, కలవలపల్లి, చాగల్లు తదితర గ్రామాల పొలాల్లోని పుట్టల్లో పెద్ద ఎత్తున భక్తులు పూజలు నిర్వహించారు. పాముల పుట్టలు తక్కువగా ఉండడంతో ఒకే పుట్ట వద్ద ఎక్కువ మంది పూజలు చేశారు. బాణసంచా కాల్చారు. మండలంలో పలు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి రుద్రాభిషేకాలు, లక్ష బిల్వార్చననిర్వహించారు.



చాగల్లులో నాగేంద్రుని పుట్టకు పూజలు చేస్తున్న భక్తులు

దేవరపల్లి: నాగుల చవితిని మండలంలో భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. భక్తులతో పొలాలు మధ్యాహ్నం వరకూ సందడిగా మారాయి. సుబ్రహ్మణ్య స్వామికి ప్రీతికరమైన మంగళవారం నాగులచవితి రావడంతో ఎక్కువ మంది భక్తులు పుట్టలో పాలు పోశారు. స్థానిక వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన పుట్టకు భక్తులు పూజలు చేసి పాలు పోశారు. ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు పుట్ట వద్ద భక్తుల రద్దీ ఏర్పడింది. అనంతరం ఆలయంలో స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి పూజలు చేశారు. కురుకూరు, చిన్నాయగూడెం, త్యాజంపూడి, దుద్దుకూరు, యాదవోలు గ్రామాల్లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

నిడదవోలు రూరల్: మండలంలోని సమిశ్రగూడెం, కోరుమామిడి, పురుషోత్తపల్లి, కలవచర్ల తదితర గ్రామాల్లో ఎక్కడ చూసినా పొలం గట్లు జనంతో సందడిగా కనిపించాయి. ఎవరికి వారు తమ కుటుంబ సభ్యులతో కలిసి పొలాల్లోని పాముల పుట్టల వద్దకు వెళ్లి నాగేంద్రుడికి పూజలు చేశారు. కోడిగుడ్లు, చిమ్మిలి, తేగలు, చలివిడి నైవేద్యంగా సమర్పించి పూజలు చేశారు. చిన్నారులు పుట్టల వద్ద బాణసంచా కాలుస్తూ సందడి చేశారు. సమిశ్రగూడెంలోని నాగలింగేశ్వరస్వామి ఆలయం వద్ద తెల్లవారుజాము నుంచి భక్తులతో కిటకిటలాడింది. ఆలయ స్థాపకుడు బిక్కవోలు సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో నాగదేవతను ప్రత్యేకంగా పుష్పాలంకరణ చేసి అభిషేకాలు, పూజలు జరిపించారు.



నిడదవోలు పట్టణంలో పుట్టలో పాలు పోస్తున్న భక్తులు

కొవ్వూరు: పట్టణంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలోను, సంస్కృత పాఠశాల, గోష్పాద క్షేత్రంలోని సుందరేశ్వరస్వామి ఆలయాల్లోని ఉప ఆలయాల్లోను నాగుల చవితి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తాళ్లపూడి: మండలంలోని గోదావరి గట్టు పైన, పంట చేలల్లోని పుట్టల్లో భక్తులు పాలు పోసి పూజలు నిర్వహించారు. నాగేంద్రుడిని ప్రసన్నం చేసుకోవడానికి పాలు, చిలిమిడి, వడపప్పు, కోడి గుడ్డు, చిమిలి, బుర్ర గుంజు, తేగ తదితర వాటిని పుట్టలో వేసి పూజలు చేశారు.



దేవరపల్లిలో సుబ్రహ్మణ్యస్వామి గుడి వద్ద పుట్టకు పూజలు చేస్తున్న భక్తులు



సమిశ్రగూడెంలో పుట్టకు పాలు పోసి నాగేంద్రునికి మొక్కుతున్న భక్తులు

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు చాగల్లు బాలికలు

చాగల్లు: స్కూల్ గేమ్స్ అండర్–19 రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు చాగల్లు జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు ఇద్దరు ఎంపికయ్యారు. ఇటీవల ఏలూరులో నిర్వహించిన జిల్లా స్థాయి స్థాయి ఎంపిక పోటీల్లో ఈ పాఠశాల విద్యార్థినులు ఎస్.రాజా ప్రవల్లిక, సత్య సౌమ్య అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ నేపథ్యంలో త్వరలో నిర్వహించే రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వాలీబాల్ జట్టుకు వారిద్దరినీ ఎంపిక చేసినట్టు ఆ పాఠశాల వ్యాయమోపాధ్యాయురాలు జె. విజయలక్ష్మి మంగళవారం తెలిపారు.



వాలీబాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థినులను అభినందిస్తున్న దృశ్యం